



# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190






ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :145 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ సోమవారం- 21 - సెప్టెంబర్ - 2026


## గొడ్డలి పార్టీని ఆదరించడమంటే విషపామును పెంచి పోషించడమే



అబద్ధాలు, అసత్యాలతో ప్రజలను వంచిస్తూ చెలామణి అవుతున్న గొడ్డలి పార్టీని రాజకీయాల నుంచి తరిమికొట్టాలని ప్రజలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు.

మహిళలను అవహేళన చేస్తూ కించపరుస్తున్న గొడ్డలి పార్టీ నాయకులను వారే నిలదీయాలని స్పష్టం చేశారు.

పాలకొల్లు, సెప్టెంబర్ 20: అబద్ధాలు, అసత్యాలతో ప్రజలను వంచిస్తూ చెలామణి అవుతున్న గొడ్డలి పార్టీని రాజకీయాల నుంచి తరిమికొట్టాలని ప్రజలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. మహిళలను అవహేళన చేస్తూ కించపరుస్తున్న గొడ్డలి పార్టీ నాయకులను వారే నిలదీయాలని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీని ఆదరించడమంటే విషపామును పెంచి పోషించడమేనని మండిపడ్డారు. మిగతా..2లో

## రాష్ట్రానికి వర్ష సూచన.. వారంరోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు




వాతావరణ శాఖ తెలంగాణ రాష్ట్రానికి చల్లని కబురు చెప్పింది.

వారం రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

దీంతో మండుటెండలతో అల్లాడుతున్న ప్రజలకు ఊరట లభించనుంది.

హైదరాబాద్, సెప్టెంబర్ 20: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడే అవకాశం ఉన్నందున తెలంగాణలో ఈరోజు(ఆదివారం) నుంచి వారం రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్రంలోని 24 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించింది. ఈరోజు గంటకు 40-50 కి. మీ వేగంతో మిగతా..2లో

## ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం ఖాయం




- కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శలు చేశారు.
- ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం చేయడం ఖాయమని ఎద్దేవా చేశారు.

కరీంనగర్ జిల్లా, సెప్టెంబర్ 20 : కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శలు చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం చేయడం ఖాయమని ఎద్దేవా చేశారు. (ఆదివారం) కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దానం నాగేందర్ తను వినాయకుడితో పోల్చుకోవడం సరికాదని పేర్కొన్నారు. వినాయకుడిని చివరిలో నిమజ్జనం చేస్తారనే విషయం దానం నాగేందర్‌కు తెలియదా.? అని ప్రశ్నించారు.

## పాఠశాల విద్యార్థులకు మరింత ఆకర్షణీయంగా..

# ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా

- విద్యార్థుల యూనిఫాం రూపకల్పన, పంపిణీపై ఆదేశాలు జారీ చేశారు.
- రెండవ జత దుస్తులను కూడా ఈ సెప్టెంబర్ నెలాఖరు నాటికి విద్యార్థులందరికీ అందిస్తామని స్పష్టం చేశారు.
- వచ్చే విద్యాసంవత్సరంలో ప్రవేశాలు మరింత పెరిగే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి విశ్లేషించారు.



తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వచ్చే విద్యాసంవత్సరం నుంచి మరింత ఆకర్షణీయమైన రంగులు, నూతన డిజైన్లతో కూడిన యూనిఫాంలు అందనున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, పాఠశాల హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు దుస్తులు, ఇతర నిత్యావసర విద్యా సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల యూనిఫాం రూపకల్పన, పంపిణీపై ఆదేశాలు జారీ చేశారు. వచ్చే విద్యాసంవత్సరంలో బడులు తెరిచే మొదటి రోజే విద్యార్థులందరికీ దుస్తులు, పాఠ్యపుస్తకాలు, ఇతర అవసరమైన వస్తువులు అందేలా ముందస్తుగా సమగ్ర కార్యాచరణను సిద్ధం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మిగతా..2లో

## ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే ప్రమాదకరం



- అవకాశం ఉన్నా కరెంట్ ఇవ్వకుండా లేని కరవును సృష్టిస్తున్నారంటూ హరీశ్ రావు ఫైర్
- 24 గంటల కరెంట్ పోయి 6-7 గంటలకే పరిమితమైందని విమర్శలు
- మూడు పంటల నుంచి రైతుబంధు పెండింగ్‌లో పెట్టారని ఆరోపణ
- పిట్ట బెదిరింపులకు భయపడేది లేదని ప్రభుత్వానికి హెచ్చరిక

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు.

## విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన బీజేపీ, ఆర్ఎస్ఎస్- విద్యార్థులకు అండగా రాహుల్




- విద్యార్థులను అణచివేస్తున్న వ్యవస్థ వెనుక ఉన్నది బీజేపీ ఆర్ఎస్ఎస్ వాళ్లేనని కాంగ్రెస్ ఆరోపణ
- విద్యా వ్యవస్థను గుల్లగా మార్చి, అవినీతిమయం చేశారని విమర్శ

హైదరాబాద్ : బీజేపీ- ఆర్ఎస్ఎస్ దేశంలోని విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి, అవినీతిమయం చేశాయని

## అమెరికా-ఇరాన్ యుద్ధం.. రూ.4 లక్షల కోట్లు దాటిన అమెరికా వ్యయం

- అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో చెప్పలేని పరిస్థితి.
- అమెరికా చేసిన ఖర్చు మన దేశంలోని అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌తో సమానం.



ఢిల్లీ : అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో చెప్పలేని పరిస్థితి. ఈ యుద్ధం అమెరికాకు ఆర్థిక భారంగా మిగిలింది. ఈ యుద్ధం కోసం ట్రంప్ ప్రభుత్వం చేసిన వ్యయం 45.1 బిలియన్ డాలర్లుగా తేలింది. అంటే మన కరెన్సీలో రూ.4.32 లక్షల కోట్లు అని ట్రంప్ ప్రభుత్వం యూఎస్ కాంగ్రెస్‌కు తెలిపింది. దాదాపు ఏడు నెల నుంచి సాగుతున్న ఈ యుద్ధం కోసం అమెరికా చేసిన ఖర్చు మన దేశంలోని అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌తో సమానం. ఇందులో 43.6 బిలియన్ డాలర్లు యుద్ధం కోసం ఖర్చుకాగా, 1.5 బిలియన్ డాలర్లు చమురు కోసం అయిన ఖర్చు. అయితే, ఇది అంచనా మాత్రమే. కచ్చితమైన, పూర్తిస్థాయి వివరాలు కాదు. గత ఫిబ్రవరి 28 నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ 2 వరకు జరిగిన ఖర్చు మాత్రమే. ఈ వ్యయంలో మిలిటరీ స్థావరాల ధ్వంసం, అనేక బిల్డింగులు ధ్వంసం కావడం, వాటి మరమ్మతులకు మిగతా..2లో

## రష్యాపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్ మాస్కో చరిత్రలోనే అతిపెద్ద డ్రోన్ దాడి

- రాత్రికి రాత్రే వెయ్యికిపైగా డ్రోన్లను ప్రయోగించిన ఉక్రెయిన్
- ఈ దాడుల్లో ఇద్దరు మృతి, 20 మందికిపైగా గాయాలు
- రాజధాని మాస్కో లక్ష్యంగా వందలాది డ్రోన్లు ప్రయోగం

### పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ వేళ అటాక్



ఢిల్లీ : రష్యా- ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. పార్లమెంటర్ ఎన్నికలు జరుగుతున్న వేళ రాజధాని మాస్కోపై ఉక్రెయిన్ విరుచుకుపడింది. మిగతా..2లో

## గత వైసీపీ ప్రభుత్వ మద్యం విధానంపై మంత్రి పార్థసారథి తీవ్ర ఆరోపణలు




- రూ.3,200 కోట్ల మద్యం కుంభకోణంపై జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్
- కీలక అధికారి సత్యప్రసాద్ వాంగ్మూలంతో కుంభకోణం గుట్టు రట్టయిందని వెల్లడి
- డిజిటల్ చెల్లింపులు రద్దు చేసి నగదు లావాదేవీలతో భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపణ
- కూటమి ప్రభుత్వంలో పారదర్శక మద్యం విధానం అమలు చేస్తున్నామని స్పష్టీకరణ

అమరావతి : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మద్యం విధానం ద్వారా వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడటమే కాకుండా, విషతుల్యమైన మద్యాన్ని అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు

## విద్యాశాఖలో రాజకీయాలకు చోటులేదు

# 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' అమలు

- కాకినాడ జిల్లాలో మంత్రి లోకేశ్ పర్యటించారు.
- కాకినాడ రూరల్ అచ్చంపేటలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో నిర్వహించిన "భారతీయం" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.




అమరావతి : క్లాస్‌రూమ్ నుంచే సమాజంలో మార్పు సాధ్యమని, విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్. సాంకేతికతకు భారతీయ విలువలు జోడిస్తే ప్రపంచ విజేతలుగా ఎదగవచ్చని చెప్పారు. విద్యాశాఖలో రాజకీయాలకు చోటు లేకుండా 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కాకినాడ జిల్లాలో మంత్రి లోకేశ్ పర్యటించారు. కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో నిర్వహించిన భారతీయం కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్

## వైసీపీ నేతల తీరు మార్చుకోకపోతే ప్రజల ఛీత్కారానికి గురికాక తప్పదు

- వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- వైసీపీ నేతలు తనపై చేసేవి చెత్త ఆరోపణలని ధ్వజమెత్తారు.



నెల్లూరు జిల్లా, సెప్టెంబర్ 20 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు తనపై చేసేవి చెత్త ఆరోపణలని ధ్వజమెత్తారు. నెల్లూరు జిల్లాలోని దొంతాలి లెగసీ వేస్ట్ ప్లాంటును మంత్రి నారాయణ (ఆదివారం) పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. చెత్తని కాలుస్తున్నారని వైసీపీ నేతలు అవివేకంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చదువుకున్న వారు కూడా అజ్ఞానంతో మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. చెత్తకుప్పలో బయోగ్యాస్ తయారై మంటలు వస్తాయని తెలిపారు.

మొదటి పేజి తరువాయి

# గత వైసీపీ ప్రభుత్వ మద్యం విధానంపై మంత్రి పార్థసారథి తీవ్ర ఆరోపణలు

రూ.3,200 కోట్ల భారీ మద్యం కుంభకోణంపై, కీలక అధికారి సత్యప్రసాద్ వెల్లడించిన అంశాలపై గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పి తీరాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ అక్రమాలను, దోపిడీని తీవ్రంగా ఎండగట్టారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి, అధికారులను ఒత్తిడికి గురిచేసి అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.

### రూ.3,200 కోట్ల ముడుపులు ఎవరివి?

మద్యం విధానంలో భాగంగా సుమారు రూ.3,200 కోట్ల ముడుపులు చేతులు మారినట్లు రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఓఎస్డీ సత్యప్రసాద్ కోర్టుకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారని మంత్రి పార్థసారథి తెలిపారు. ఈ కుంభకోణానికి సంబంధించిన కీలక నిర్ణయాలన్నీ అప్పటి ముఖ్యమంత్రి నివాసమైన తాడేపల్లి ప్యాలెస్‌లోనే తీసుకున్నారని సత్యప్రసాద్ చెప్పినట్లు వార్తలు వస్తున్నాయని తెలిపారు. "నిజాలు బయటపెడుతున్న సత్యప్రసాద్ మానసిక స్థితి సరిగా లేదని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్నప్పుడు ఆయన ఆరోగ్యంగా ఉన్నట్లేనా? ఇప్పుడు వాస్తవాలు వెల్లడిస్తుండటంతోనే ఇలాంటి ముద్ర వేసి అసలు అంశాన్ని పక్కదారి పట్టించాలని చూస్తున్నారు. ఈ తప్పుడు ప్రచారాలు ఆపి, ఆరోపణలకు సూటిగా సమాధానం చెప్పాలి" అని పార్థసారథి సవాల్ విసిరారు.

### నగదు లావాదేవీల వెనుక మర్మమేంటి?

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులను పూర్తిగా తొలగించి, కేవలం నగదు లావాదేవీలనే ప్రోత్సహించడం వెనుక ఉన్న మర్మమేంటని పార్థసారథి ప్రశ్నించారు. "కోట్లాది రూపాయల మద్యం విక్రయాలు నగదు రూపంలోనే జరగాలని ఎందుకు ఆదేశించారు? ఆ డబ్బు ఎక్కడికి వెళ్లింది? కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టడం, మాన్యువల్ విధానంలో ఆర్డర్లు కేటాయించడం వంటి చర్యలన్నీ అవినీతి కోసమే" అని ఆయన ఆరోపించారు. మద్యం రవాణా కాంట్రాక్టులను కూడా జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి కేంద్రీకరించి, రేట్లు పెంచి తమ అనుయాయులకు కట్టబెట్టారని విమర్శించారు. మద్యం దుకాణాల్లో సిబ్బంది నియామకాలు, వారి జీతాల చెల్లింపుల్లోనూ భారీగా అక్రమాలు జరిగాయని ఆయన పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

2019 ఎన్నికలకు ముందు సంపూర్ణ మద్య నిషేధం అని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నాసిరకం మద్యాన్ని అమ్మి ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టారని పార్థసారథి మండిపడ్డారు. కల్తీ మద్యం తాగి ఎంతోమంది అనారోగ్యం పాలయ్యారని, ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

# గొడ్డలి పార్టీని ఆదరించడమంటే విషపామును పెంచి పోషించడమే

ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఆయన మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కష్టపడి నిధులు తీసుకు వస్తున్నట్లు తెలిపారు. గొడ్డలి పార్టీ పాలనలో పాలకొల్లు నియోజకవర్గం ఒక్క రూపాయి అభివృద్ధికి కూడా నోచుకోలేదని గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా తీర్చేలా రూ. 200 కోట్ల నిధులు తీసుకు వచ్చి పనులు ప్రారంభించామని గుర్తు చేశారు. దురదృష్టవశాత్తు అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ ఆ పనిని రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ విజ్జేశ్వరం నుంచి గోదావరి జలాల మంచినీటి పథకాన్ని పునరుద్ధరించి పనులు చేపట్టామని గుర్తు చేశారు. టిడ్కో గృహాలను లబ్ధిదారుల పేరుతో తాకట్టు పెట్టి, పాలకొల్లులోనే రూ.160 కోట్ల నిధులను దారి మళ్లించింది నాటి గొడ్డలి పార్టీ ప్రభుత్వం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్ళను, మరో రెండు నెలల్లోగా లబ్ధిదారులకు అప్పగించేలా నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు.

# ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే ప్రమాదకరం: హరీశ్ రావు

ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు. "అవకాశం ఉన్నప్పటికీ విద్యుదుత్పత్తి చేయకుండా బొగ్గు కొరత అనే సాకుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ గారి హయాంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే.. ఇప్పుడు కేవలం 6-7 గంటల నాణ్యత లేని విద్యుత్ మాత్రమే వస్తోంది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. కృష్ణా నదిలో నీళ్లున్నా కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి లిఫ్టులను ఆన్ చేయడం లేదు," అని హరీశ్ రావు మండిపడ్డారు. మూడు పంటల నుంచి రైతుబంధు నిధులు విడుదల చేయలేదని, కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఆపలేదని గుర్తుచేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై ప్రమాణం చేసి కూడా సీఎం రేవంత్ రెడ్డి దేవుణ్ని మోసం చేశారని ఆరోపించారు. బాండ్ పేపర్లపై ఇచ్చిన 420 హామీలు, గొర్రెల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ఊసే లేదని విమర్శించారు. తనను ప్రశ్నించినందుకు పిట్ట బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని, ఆయన సంగతి చూస్తామని హెచ్చరించారు. "కేసీఆర్‌పై బురద చల్లితే రైతులకు న్యాయం జరగదు. పాలించడం చేతకాకపోతే నుదుటిపై 'నామమ్' రాసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని హరీశ్ రావు హితవు పలికారు.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం ఖాయం

దానం నాగేందర్ నిండు నూరేళ్లు జీవించాలని బండి సంజయ్ కోరుకున్నారు. కాంగ్రెస్ తమకు పోటీనే కాదని స్పష్టం చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికను ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నేతల ఫాంహౌస్ సందర్శన ఓ జోక్ లాగా ఉందని వ్యంగ్యంగా మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ ఫాంహౌస్‌లు ఏమైనా టూరిజానికి కేంద్రాలా.? అని ప్రశ్నించారు. ప్రైవేటు భూముల్లోకి వెళ్లడానికి కాంగ్రెస్ నేతలకు అధికారం ఎక్కడదని బండి సంజయ్ ప్రశ్నించారు.

# అమెరికా-ఇరాన్ యుద్ధం.. రూ.4 లక్షల కోట్లు దాటిన అమెరికా వ్యయం

సంబంధించిన ఖర్చుల్ని చేర్చలేదు. పూర్తిస్థాయి వ్యయ వివరాల్ని కూడా ప్రభుత్వం వెల్లడించలేదు. ప్రస్తుతం అంచనా వేసిన ఖర్చు.. గతంలో అంచనాలకు మించింది. ప్రస్తుతం ఈ యుద్ధం కొనసాగుతున్నందున ఖర్చు భవిష్యత్తులో ఇంకా పెరిగే అవకాశం ఉంది. అమెరికా చేసిన వ్యయంలో మిస్సైల్స్, క్షిపణుల్ని అడ్డుకునే టెక్నాలజీ కోసమే ఎక్కువ ఖర్చు అయింది. ఇదే సమయంలో యుద్ధం కారణంగా చమురు సరఫరాలో ఇబ్బందులు ఎదురవ్వడం వల్ల కూడా ఆర్థిక భారం పెరిగింది. ఈ ఖర్చులకు ద్వైపాక్షిక సంబంధాలపై జరిగిన చర్చలు వంటివి అదనం.

# పాఠశాల విద్యార్థులకు మరింత ఆకర్షణీయంగా.. ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా

ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల దుస్తులకు ఏమాత్రం తీసిపోని విధంగా, పిల్లలు ఇష్టపడే ఆధునిక డిజైన్లు, ఆకర్షణీయమైన రంగులను ఎంపిక చేసేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన సూచించారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన విద్యా సామాగ్రి సరఫరా పురోగతిపై రేవంత్ రెడ్డి ఈ సమీక్షా సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాలు, గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులకు ఇప్పటికే మొదటి జత యూనిఫాంల సరఫరా చేసినట్లు ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రెండవ జత దుస్తులను కూడా ఈ సెప్టెంబర్ నెలాఖరు నాటికి విద్యార్థులందరికీ అందిస్తామని స్పష్టం చేశారు.

### తిరుమలలో 24 లక్షల సర్వింగ్స్.. !!

మరోవైపు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, మోడల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇప్పటికే విద్యాశాఖ ద్వారా రెండు జతల యూనిఫాంలను పంపిణీ చేయడం పూర్తయిందని అధికారులు వివరించారు. యూనిఫాంతో పాటు విద్యార్థులందరికీ నోట్ బుక్స్ పంపిణీ ప్రక్రియ కూడా వంద శాతం ముగిసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల పరిధిలోని విద్యార్థులందరికీ రోజువారీ అవసరాల కోసం ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలు, స్పూన్లు, కప్పులతో పాటు కార్పెట్లు, బెడ్ షీట్లు, నాణ్యమైన టవళ్లను అందించినట్లు వివరించారు.

### ఏపీలో ప్రభుత్వం మారి రెండేళ్లు దాటినా.. !!

తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని, వచ్చే విద్యాసంవత్సరంలో ప్రవేశాలు మరింత పెరిగే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి విశ్లేషించారు. బడుల్లో అడ్మిషన్లు కనీసం 10 శాతం మేర పెరిగే అవకాశం ఉందని, అందుకు తగిన విధంగా అదనపు వస్తు సామగ్రిని ముందస్తుగానే అంచనా వేసి సిద్ధంగా ఉంచాలని అధికారులను సూచించారు. ఈ ఏడాది తమ ప్రభుత్వం అందించిన యూనిఫాంల నాణ్యతతో పాటు ఇతర సదుపాయాలపై విద్యార్థుల తల్లిదండ్రులు సంతృప్తిని వ్యక్తం చేయడం శుభపరిణామమని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రతినిధులు పీ సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, అధికారులు ఎస్ శ్రీధర్, వేముల శ్రీనివాసులు, సబ్యసాచి ఘోష్, బాల మాయాదేవి, అహ్మద్ నదీమ్, దివ్య దేవరాజన్, నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి వర్ష సూచన.. వారంరోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు

మొదటి పేజి తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా ఈదురుగాలులు వీస్తాయని.. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మేరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రేపు(సోమవారం)రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట,




రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వారు వెల్లడించారు.

### వాయుగుండంగా మారే అవకాశం..

ప్రస్తుతం అల్పపీడనం ఉత్తర అండమాన్ సముద్రం, దానికి ఆనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతోంది. ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇది సెప్టెంబర్ 21న వాయుగుండంగా, 22న తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 23 ఉదయం నాటికి దక్షిణ ఒడిశాఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాలకు సమీపంలోని పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతానికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో 20, 21, 22, 23, 24, 25వ తేదీల్లో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# విద్యాశాఖలో రాజకీయాలకు చోటులేదు - 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' అమలు

మొదటి పేజి తరువాయి

సలహాదారు చాగంటి కోటేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే చిన్నరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఘన స్వాగతం పలికారు. విలువల విద్యపై విద్యార్థులకు దిశానిర్దేశం : విద్యార్థులు ఆలపించిన వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థులను మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్, లాల్‌బహదూర్ శాస్త్రి, అంబేద్కర్, అబ్దుల్ కలామ్, విశ్వేశ్వరయ్య తదితరుల పాత్రలను విద్యార్థులు ప్రదర్శించారు. వారి దేశభక్తి సందేశాలు ఆకట్టుకున్నాయి. చాగంటి కోటేశ్వరరావు విద్యార్థులకు నైతిక విలువలు, దేశభక్తిపై సందేశం ఇచ్చారు. అనంతరం మంత్రి నారా లోకేశ్ విద్యార్థులతో ముచ్చటించారు. లోకేశ్ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. దేశభక్తి, త్యాగధనుల స్ఫూర్తి, విలువల విద్యపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సాంకేతికతకు భారతీయ విలువలు తోడైతే, ప్రపంచ విజేతలుగా ఎదగొచ్చని పిల్లల్లో చిన్నప్పటి నుంచే పెద్దలను, మహిళలను గౌరవించడం గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించడం నేర్పించాలని మంత్రి లోకేశ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన సంస్కరణలను ప్రస్తావించిన మంత్రి లోకేశ్ ఈ ఏడాది లక్షా పది వేల మంది విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని, ఇంటర్‌లోనూ పది వేల అడ్మిషన్లు పెరిగాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. నైతిక విలువలు కూడా తోడైతే ఏపీ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దేశంలోనే ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్ : విద్యాశాఖలో రాజకీయాలకు చోటు లేకుండా 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూస్‌లో రాజకీయ పార్టీ రంగులు లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. సమాజంలో మార్పు క్లాస్‌రూమ్ నుంచే ప్రారంభమవుతుందని ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం విద్యార్థి కేంద్రంగా ఉండాలన్నారు. రోబోటిక్స్ గురించి మాట్లాడుతున్నాం వాటికి భారతీయం, నైతిక విలువలు తోడవ్వాలి' అని అప్పుడే మనం ప్రపంచ విజేతలుగా ఎదుగుతామని లోకేశ్ చెప్పారు. చిన్నచిన్న సమస్యలకు కుంగిపోకుండా ఎదురొడ్డి నిలవాలని విద్యార్థులకు మంత్రి సూచించారు. మార్కులు తక్కువ వచ్చాయని, అనుకున్నది సాధించలేకపోయామని తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పారు. ఇంట్లో చెప్పుకోలేని సమస్యలు ఉంటే ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల త్యాగాలను గుర్తుంచుకుని వారు గర్వపడేలా ఎదగాలని పిలుపునిచ్చారు. "విద్య వల్ల సమాజంలో మార్పు తీసుకురావచ్చు. నాకు విద్యాశాఖను ఇవ్వాలని సీఎంను కోరాను. విద్య, ప్రభుత్వ స్కూళ్లంటే సీఎంకు చాలా ఇష్టం. విద్యావ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలి. గతంలో బాపట్లలో జరిగిన మెగా పీటీఎంకు సీఎం వచ్చారు. నాడు పిల్లలకు పెట్టే భోజనమే సీఎంకు వడ్డించారు. ఈ భోజనం క్వాంటిటీ సరిపోదు, పెంచాలని సీఎం చెప్పారు. ఎక్కడా లేని విధంగా ఏపీలోని ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెరిగాయి. ఓర్పు, సహనం, నైతిక విలువలు మనకు చాలా అవసరం. దేశం కోసం ఆలోచించాలి, దేశం కోసం త్యాగం చేయాలి." - నారా లోకేశ్, విద్యాశాఖ మంత్రి సక్సెస్‌కు షార్ట్‌కట్ ఉండదు : సక్సెస్‌కు షార్ట్‌కట్ ఉండదని హార్డ్‌వర్క్‌తోనే మంచి స్థాయికి వెళ్లగలమని లోకేశ్ అన్నారు. గెలుపు, ఓటమి రెండింటినీ సమానంగా తీసుకోవాలని తల్లిదండ్రులు తలదించుకునేలా కాకుండా తలెత్తుకునేలా చేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ప్రముఖ ప్రవచన కర్త, ప్రభుత్వ సలహాదారుడు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. దేశ స్వాతంత్ర్యం గత చరిత్ర మాత్రమే కాదని అది భారతీయుల వారసత్వ సంపద అని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు నడయాడిన ప్రదేశాలను సందర్శించడం ద్వారా పిల్లల్లో దేశభక్తి మరింత పెరుగుతుందని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటం గత చరిత్ర కాదు మన భారతీయుల వారసత్వ సంపద అని చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేసి మనకు స్వేచ్ఛను అందించారన్నారు. ఆ త్యాగాల విలువను తెలుసుకుని భావితరాలకు అందించాలన్నారు. గాంధీ నుంచి అంబేద్కర్ వరకు ప్రకాశం పంతులు నుంచి పొట్టి శ్రీరాములు వరకు దేశం కోసం జీవితాలను అంకితం చేసిన మహనీయుల చరిత్రను పిల్లలకు తెలియజేయాలని చాగంటి కోటేశ్వరరావు సూచించారు.

# వైసీపీ నేతల తీరు మార్చుకోకపోతే ప్రజల ఛీత్కారానికి గురికాక తప్పదు

మొదటి పేజి తరువాయి

తగలపడుతోందని చెప్పుకొచ్చారు.

అవినీతికి పాల్పడాల్సిన అవసరం నాకు లేదు..

ప్రజలను తప్పుదారి పట్టించేందుకే వైసీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి నారాయణ ఆగ్రహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు జగన్ అండ్ కో కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. అవినీతికి పాల్పడ్డానని తనపై నిందలు వేస్తున్నారని దుయ్యబట్టారు. అవినీతికి పాల్పడాల్సిన అవసరం తనకు లేదని స్పష్టం చేశారు. డబ్బే కావాలనుకుంటే నారాయణ విద్యాసంస్థలు చూసుకొంటే చాలని తెలిపారు. 2019లో నారాయణ విద్యాసంస్థల టర్నోవర్ ఏడాదికి రూ.2500 కోట్లు అని వెల్లడించారు. 2024కి



దాన్ని రూ.6500 కోట్ల టర్నోవర్‌కి పెంచి తన పిల్లలకు అప్పగించానని తెలిపారు.

పేదరికం నుంచి వచ్చి ఈ స్థాయికి ఎదిగాను..

పేదరికం నుంచి వచ్చి తాను ఈ స్థాయికి ఎదిగానని మంత్రి నారాయణ వెల్లడించారు. పేదల కష్టాలను స్వయంగా చూశానని ప్రస్తావించారు. ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి తాను వచ్చానని తెలిపారు. పేదల అభ్యున్నతికి తన వంతుగా కృషిచేస్తున్నానని అన్నారు. పేద పిల్లలకు విద్యను ఆస్తిగా ఇవ్వాలని కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ స్కూల్స్‌ను అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. భగత్ సింగ్ కాలనీ, సర్వేపల్లి కాలువకట్ట వాసులకు శాశ్వత పట్టాలు ఇప్పించానని చెప్పారు. ఓర్వలేక వాటిపైనా విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ అండ్ కో ఆలోచించి మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వైసీపీ నేతల తీరు మార్చుకోకపోతే ప్రజల ఛీత్కారానికి గురికాక తప్పదని మంత్రి నారాయణ హెచ్చరించారు.

# రష్యాపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్- మాస్కో చరిత్రలోనే అతిపెద్ద డ్రోన్ దాడి- పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ వేళ అటాక్

మొదటి పేజి తరువాయి

మునుపెన్నడూ లేని స్థాయిలో రాత్రికి రాత్రే వందలాది డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. పలు భవనాలు, చమురు శుద్ధి కర్మాగారాలు దెబ్బతిన్నాయి. మరోవైపు, ఉక్రెయిన్ ప్రయోగించిన చాలా డ్రోన్లను తమ బలగాలు మార్గమధ్యంలోనే అడ్డుకున్నాయని రష్యా ప్రకటించింది.

మాస్కో ఆయిల్ రిఫైనరీలో పెద్దఎత్తున మంటలు

అయితే, ఉక్రెయిన్ దాడుల కారణంగా మాస్కో ఆయిల్ రిఫైనరీలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో సమీప ప్రాంతాల్లో భారీగా పొగ వ్యాపించింది. పలు నివాసాలు దెబ్బతిన్నాయి. మాస్కో చరిత్రలోనే అతిపెద్ద డ్రోన్ దాడి ఇదేనని అధికారులు తెలిపారు. మాస్కో వైపు దూసుకొచ్చిన 450కుపైగా డ్రోన్లను అడ్డుకున్నట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. అటు రష్యా ఆక్రమిత క్రిమియాపైనా ఉక్రెయిన్ పెద్ద ఎత్తున దాడులు కొనసాగిస్తోంది. సైనిక సరఫరాలను, విద్యుత్తు వ్యవస్థల్ని స్తంభింపజేసేలా తాజా దాడులు జరిపింది. వీటి కారణంగా మాస్కోలోని ప్రధాన విమానాశ్రయాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. దీంతో పలు విమానాలు రద్దుకాగా మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి.

రష్యా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచడమే లక్ష్యం

ఈ దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందించారు. రష్యా చమురు, లాజిస్టిక్స్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేసినట్లు ఎక్స్ వెల్లడించారు. ఈ దాడుల్లో రష్యా చమురు కర్మాగారం దెబ్బతిన్నట్లు తెలిపారు. ఇందుకు గానూ, తమ సైనిక సిబ్బంది, గూఢచర్య విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో రష్యా యుద్ధ యంత్రాంగాన్ని నడిపిస్తున్న బిలియన్ల కొద్దీ డాలర్ల ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇకనైనా మాస్కో యుద్ధాన్ని ముగించి, శాంతి దిశగా అడుగులు వేయాలని కోరుకుంటున్నట్లు జెలెన్ స్కీ తెలిపారు.

యుద్ధం అనంతరం తొలిసారిగా ఎన్నికలు

మరోవైపు, ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యాలో తొలిసారిగా పార్లమెంటర్ ఎన్నికలు జరుగుతున్నాయి. అధ్యక్షుడు పుతిన్ విధానాలను వ్యతిరేకించే ప్రతిపక్షం దాదాపుగా లేకుండా సాగుతున్న ఈ ఎన్నికల ద్వారా క్రెమ్లిన్ ఆధిపత్యం మరింత సుస్థిరం కానుంది. అయితే రష్యా ఆక్రమిత ప్రాంతాల్లో కూడా పోలింగ్ నిర్వహించడాన్ని కీవ్ తీవ్రంగా తప్పుబట్టింది. రష్యా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించేందుకే ఉక్రెయిన్ తాజా దాడులకు పాల్పడిందని, అయితే ఆ కుట్రలో శత్రువులు విఫలమయ్యారని రష్యా పేర్కొంది. ఉక్రెయిన్ డ్రోన్‌లను సమర్థవంతంగా కూల్చివేశాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. రష్యా రాజధాని వైపు వస్తున్న 450 డ్రోన్‌లను మార్గమధ్యంలో ధ్వంసం చేశారని మాస్కో మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు.

అత్యాధునిక డ్రోన్ సాంకేతికత

ఇదిలా ఉండగా, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై దాదాపు



నాలుగేళ్లు గడుస్తుంది. అయినప్పటికీ ఇరుపక్షాలు సైనికులు ప్రతిదాడులతో విరుచుకుపడుతున్నారు. ఈ నేపథ్యంలో మరో కీలక పరిణామం జరిగింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ సైనిక డ్రోన్ సాంకేతికతలో ప్రపంచ అగ్రగామిగా నిలిచింది. రష్యా లోపలికి చొచ్చుకెళ్లి దాడులు చేయడానికి, దేశీయంగా ఉత్పత్తి చేసిన సుదూర డ్రోన్‌లతో పాటు క్షిపణులను కూడా మోహరిస్తోంది. అయితే, ఉక్రెయిన్ డ్రోన్ సాంకేతికత ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాలను, రక్షణ పరికరాల తయారీదారులను ఆకట్టుకుంది. శాంతి ఒప్పందం కోసం చర్చలు జరపాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి తేవాలని కీవ్ లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, యుద్ధాన్ని ఆపే ఉద్దేశం ఉన్నట్లు పుతిన్ ఇప్పటివరకు ఎలాంటి సంకేతాలు చూపలేదు. దీంతో యుద్ధ ముగింపుపై తీవ్ర సందిగ్ధత నెలకొంది.

# విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన బీజేపీ, ఆర్ఎస్ఎస్- విద్యార్థులకు అండగా రాహుల్

కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఆరోపించింది. అయితే, వ్యవస్థలోని లోపాలపై జవాబుదారీతనం కోసం పరితపిస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అండగా నిలుస్తున్నారని స్పష్టం చేసింది. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి కంచుకోట అయిన ఇందౌర్‌లో శనివారం రాహుల్ గాంధీ నిర్వహించిన ఐదో విడత 'ఛాత్రోన్ కీ గూంజ్' సదస్సుపై కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. విద్యార్థులను అణచివేస్తున్న ప్రస్తుత వ్యవస్థ వెనుక ఉన్నది బీజేపీ ఆర్ఎస్ఎస్ వాళ్లేనని ఆరోపించారు. "విద్య, ఆర్థిక వ్యవస్థ, రాజకీయం ఇలా దేశంలోని ప్రతి రాజ్యాంగ సంస్థపై వారి నియంత్రణ ఉంది. వారు విద్యా వ్యవస్థను గుల్లగా మార్చి, అవినీతిమయం చేశారు. విద్యార్థులను అణచివేస్తున్న ఈ వ్యవస్థ రహస్యాన్ని రాహుల్ గాంధీ శనివారం జరిగిన కార్యక్రమంలో బయటపెట్టారు. విద్యార్థులు ప్రశ్నలు అడుగుతారని, జవాబుదారీతనం కోరతారని ఆ వ్యవస్థ భయపడుతోంది. కానీ, ఇప్పుడు రాహుల్ గాంధీ వారికి అండగా నిలబడడంతో విద్యార్థుల్లో భయం తొలగిపోయింది. ప్రస్తుతం వారి గొంతు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోంది."

- జైరాం రమేశ్ , కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్

రాహుల్ గాంధీ ఏమన్నారంటే?

దేశం నుంచి ద్వేషాన్ని తరిమిగొట్టగలిగేది అంధ భక్తులు కాదని, ఆ పని కేవలం విద్యార్థులవల్లే అవుతుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఛాత్రోం కీ గూంజ్ ఐదో కార్యక్రమంలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో శనివారం విద్యార్థులతో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీలకు మద్దతుగా నిలుస్తున్న వారిని అంధ భక్తులుగా ఆయన అభివర్ణించారు. యావద్దేశం వ్యవస్థ గుప్పిట్లో ఉందని, విద్యార్థులు ప్రశ్నించడాన్ని అది కోరుకోవట్లేదని రాహుల్ వ్యాఖ్యానించారు. ఏ దేశానికైనా యువతే భవితవ్యమని, వారు లేకుండా దేశాలేవీ బలపడలేవని స్పష్టం చేశారు. దేశంలో 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, లక్ష



పాఠశాలలు మూతపడ్డాయని దుయ్యబట్టారు. యూపీఏ సర్కారు ఉన్నప్పుడు విద్య కోసం 4.6% బడ్జెట్‌ను కేటాయిస్తే, ప్రస్తుత ప్రభుత్వం 2.6 శాతం కేటాయించిందని ధ్వజమెత్తారు. అలాగే, సోషల్ మీడియా సహా అన్నింటినీ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ నియంత్రిస్తున్నారని, నిఘా కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎంపీపీఎస్సీలో అక్రమాలను ప్రశ్నిస్తే తమపై కేసు నమోదు చేసి జైలుకు పంపారని దేవాస్‌కు చెందిన ఓ విద్యార్థి తెలిపారు. మధ్యప్రదేశ్‌లో నియామక పరీక్షలకు సంబంధించిన 13 శాతం కోటాను నిలిపివేసిన అంశాన్ని పలువురు విద్యార్థులు రాహుల్‌తో పంచుకున్నారు. దేశ రాజకీయ, సంస్థాగత, ఆర్థిక అంశాలపై ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీలు నియంత్రణను కలిగి ఉన్నారని ఆరోపించారు.

మోదీపై చేసిన విమర్శలను ఖండించిన బీజేపీ

ఇదిలా ఉండగా, ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. కాంగ్రెస్ క్షమించరాని నీచ స్థాయికి దిగజారిందని బీజేపీ అధికార ప్రతినిధి యాసర్ జిలానీ ఆదివారం ఆరోపించారు. గతంలో నిర్వహించిన ఒక ర్యాలీలో మోదీ తల్లి పట్ల, మాతృత్వం పట్ల గౌరవాన్ని అపహాస్యం చేశారని మండిపడ్డారు. అలాగే ఇందౌర్ జరిగిన వ్యాఖ్యలు అనుచితమైనవని, దాన్ని ప్రజలు ఎప్పటికీ క్షమించరని వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో మోదీ తల్లి గురించి ఎవరూ తప్పుగా మాట్లాడలేదని కాంగ్రెస్ నాయకుడు రాకేశ్ సిన్హా తెలిపారు. ఆమె అందరికి తల్లి వంటివారని పేర్కొన్నారు.

నేటి దిక్సూచి
తెలుగు దిన పత్రిక
TGTEL/25/A31
సోమవారం- 21 - సెప్టెంబర్ - 2026

## మంచిర్యాల జిల్లా టిఎల్ఎస్ఎ అధ్యక్షుడిగా
# ముక్త సంతోష్ కుమార్.



జైపూర్ .తెలంగాణ రాష్ట్రంలో న్యాయ విద్యార్థుల హక్కుల కోసం, న్యాయ అవగాహన కోసం అలుపెరుగక పోరాడుతున్న తెలంగాణ లీగల్ స్టూడెంట్ అసోసియేషన్ (టిఎల్ఎస్ఎ) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా జైపూర్ మండల్ ఇందారం గ్రామానికి చెందిన యువ నాయకులు ముక్త సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మంతెన ఉదయ్ కిరణ్ నియమితులయ్యారు.ఈ మేరకు టిఎల్ఎస్ఎ వ్యవస్థాపక అధ్యక్షులు,కె. బాలు నాయక్ అధికారిక నియామక పత్రాన్ని అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన జిల్లా అధ్యక్షుడు ముక్త సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. తనపై అపార నమ్మకం ఉంచి అత్యంత కీలకమైన జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన టిఎల్ఎస్ఎ రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా న్యాయ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి, యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, అదేవిధంగా పల్లెపల్లెనా, గడపగడపనా న్యాయంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా న్యాయ అవగాహన సదస్సులు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని స్పష్టం చేశారు. సంస్థ లక్ష్యాలు, ఆశయాల సాధనకు అహర్నిశలు అంకితభావంతో, నిబద్ధతతో పనిచేస్తానని పేర్కొన్నారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన సంతోష్ కుమార్ కు టిఎల్ఎస్ఎ జిల్లా, రాష్ట్ర నాయకులు, సభ్యులు, న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు ఘనంగా అభినందనలు తెలియజేస్తూ.. నూతన బాధ్యతల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# రెబ్బెన మండల కాంగ్రెస్ కమిటీ నియామకం



రెబ్బెన సెప్టెంబర్ 20 : కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడంలో భాగంగా చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా రెబ్బెన మండల కాంగ్రెస్ కమిటీని నియమించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నూతన మండల కమిటీలో అజ్మీరా బలరాం, పాలగాని పర్వతాలు ఉపాధ్యక్షులుగా, కుందారపు నగేష్ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. పల్లె శ్రీనివాస్, ఆవిడపు గోపి, ఎగురపు రవి, జాదవ్ ప్రేమ్‌దాస్‌లను ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. జూపాక అనిల్, దాసరి సాంబగౌడ్, జూపాక రాజేశ్వరి, ఎరబోతుల నగేష్, కొండగొర్ల చంద్రశేఖర్‌లను కార్యదర్శులుగా, అజ్మీరా ఈశ్వర్‌ను కార్యదర్శిగా నియమించారు. అడప విమలను ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, తిడాల వెంకటేష్, గాడిసెల వెంకటేశ్వ గౌడ్, గుండా రవి గౌడ్, జహురుద్దీన్, ఎండా రవి, గజ్జెల సృజన్, జి. శంకరమ్మ, ఆజాద్ అలీ సయ్యద్‌లను ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నియమించారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు పార్టీ కార్యక్రమాలను మండలంలోని గ్రామస్థాయికి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకత్వం సూచించింది.

# మంచిర్యాల జిల్లా అభివృద్ధికి ప్రత్యేక చొరవ

పెండింగ్ రోడ్డు పనులు, హెచ్.ఎల్.బి ల నిర్మాణంపై కేంద్రం దృష్టికి సమస్యలు

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



మంచిర్యాల జిల్లా,సెప్టెంబర్ : మంచిర్యాల ప్రజల భద్రత,మెరుగైన రవాణా సౌకర్యం,ప్రాంతాల మధ్య కనెక్టివిటీని దృష్టిలో ఉంచుకుని పార్లమెంట్ సభ్యులు వంశీకృష్ణ ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నామని మీడియా మాధ్యమం ద్వారా ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూరు, చిర్రకుంట,రసూల్‌పల్లి రోడ్డు, ఆదిల్‌పేట్, వెంకటాపూర్, ముదిగుంట ప్రాంతాలకు సంబంధించిన హై లెవల్ బ్రిడ్జిల ( హెచ్.బి.ఎల్.ఎస్ ) నిర్మాణం,రోడ్ల వైడెనింగ్,స్ట్రెంగ్థెనింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.సుమారు 16 కిలోమీటర్ల మేర రూ.40 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టాల్సిన ఈ అభివృద్ధి పనుల కోసం గత రెండు సంవత్సరాలుగా కేంద్రాన్ని కోరుతున్నామని ఎంపీ వంశీకృష్ణ తెలిపారు.ఇప్పటికే మంజూరైన పనులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయనే అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు,కేంద్ర రహదారులు,రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కి ఈ విషయాలన్నీ వివరించడం జరిగిందన్నారు.మంచిర్యాల ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు,భద్రత,మెరుగైన కనెక్టివిటీ కోసం నిరంతరం కృషి చేస్తామని ఎంపీ ఉద్ఘాటించారు.

## భీమారంలో ఘనంగా సాయిరాం
# యూత్ గణేష్ ఉత్సవ సమితి ప్రత్యేక పూజలు



భీమారం సెప్టెంబర్ 20. సాయిరాం యూత్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 51వ వార్షిక మహోత్సవ వేడుకలలో భాగంగా ఆదివారం రావి చెట్టు వద్ద ఉన్న విఘ్నేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా విఘ్నేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాల పంపిణీతో పాటు అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సాయిరాం యూత్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు నిర్వహించారు

## భీమారం ఫ్రెండ్స్ యూత్ గణేష్ మండలి వద్ద
# అన్నదాన కార్యక్రమం.

మంచిర్యాల,సెప్టెంబర్ 20.భీమారం మండల కేంద్రంలో ని ఫ్రెండ్స్ యూత్ గణేష్ మండలి వద్ద గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు.అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత భక్తి,శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకొని వారి వారి కోరికలు తీరాలని ఆ విఘ్నేశ్వరుని ప్రార్థించారు.ఈ సందర్భంగా కమిటీ వారు మాట్లాడుతూ,ఆగణనాథని కృపా,కటాక్షం వల్ల ప్రజలందరూ సుభిక్షంగా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో,ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందపు వెలుగులు నింపాలని ఆ ఏకదంతున్నీ ప్రార్థించారు.

## బాక్సింగ్ ఎంపికల్లో
# మెరిసిన కాగజ్‌నగర్ క్రీడాకారులు

జిల్లా స్థాయి బాక్సింగ్ సెలక్షన్లు విజయవంతం




ఆసిఫాబాద్ సెప్టెంబర్ 20:కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ సిరిసిల్క్ ఎఫ్ కాలనీలోని ముత్తు బాక్సింగ్ క్లబ్‌లో జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు విజయవంతంగా జరిగాయి. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. మధు, చైర్మన్ శివకుమార్ నాయర్, వైస్ ప్రెసిడెంట్ మోహన్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలకు ఎస్ఐలు యాదవ్ గిరి, రమణ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను అభినందించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎ.వి. రామ్మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. శేఖర్ యాదవ్ మరియు కోచ్‌లు గిరి, శివానంద్, సాయి కుమార్ తదితరులు ఎంపికలను నిర్వహించారు.

## కళాకారులకు తక్షణమే
# ఉద్యోగాలు కల్పించాలి



### ఉద్యమ కళాకారుల డిమాండ్

ఆసిఫాబాద్ సెప్టెంబర్ 20:కాగజ్‌నగర్ మండలం లో ఉద్యమ నిరుద్యోగ కళాకారులు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు ఉద్యోగాలు ప్రకటించలేదని కొమరం భీమ్ జిల్లా కళాకారులు మండిపడ్డారు. శాసనసభలో కళాకారుల ఉద్యోగాల విషయంలో హామీ ఇచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే మేనిఫెస్టోలోని జీవో ప్రకారం ఉద్యోగాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రవీంద్రభారతిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు డోంగ్రి సంతోష్, జిల్లా అధ్యక్షుడు మేడి కార్తీక్, రామిళ్ల రమేష్, దుర్గం సమ్మక్క, గాథమళ్ళ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన స్థలాన్ని పర్యవేక్షించిన
# కౌటాల సీఐ, ఎస్ఐ..



కొమరం భీమ్, సెప్టెంబర్ 20..కౌటాల మండలం తాటిపల్లి గ్రామపంచాయితీ వద్ద వరద నది ఒడ్డున గణేష్ నిమజ్జన స్థలాన్ని సాయంత్రం సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సంతోష్ కుమార్, ఎస్ఐ కె. సతీష్ పర్యవేక్షించారు. తక్కువ లోతు ఉన్న ప్రాంతంలో ప్రశాంతంగా నిమజ్జనం చేయాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థుడు గావుడె హనుమంతు, హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ములె దత్తు పటేల్, బడగె సుధీర్, రోహిణె సునీల్, రోహిణె రోషన్ తదితరులు పాల్గొన్నారు.

# జట్టు విజయం.. జిల్లాకు గౌరవమే లక్ష్యంగా ఆడాలి

నెట్‌బాల్ క్రీడాకారులకు మున్సిపల్ కమిషనర్ రాజలింగు సూచన



మందమర్రి, సెప్టెంబర్ 20:మైదానంలో వ్యక్తిగత ప్రతిభతో పాటు జట్టు విజయాన్ని లక్ష్యంగా చేసుకుని ఆడాలని, జిల్లా జట్టుకు ఎంపికై భవిష్యత్తులో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపెల్లి రాజలింగు క్రీడాకారులకు సూచించారు.మందమర్రి కృష్ణవేణి పాఠశాలలో ఆదివారం మంచిర్యాల జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ అండర్-14, అండర్-17 బాల, బాలికల సెలక్షన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ రాజలింగు క్రీడాకారులను పరిచయం చేసుకుని సెలక్షన్స్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి క్రీడాకారుడు తనలోని ప్రతిభ, నైపుణ్యాలను పూర్తి స్థాయిలో ప్రదర్శించి జిల్లా జట్టులో స్థానం సంపాదించుకోవాలని అన్నారు. క్రీడల్లో నిరంతర సాధన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విజయానికి కీలకమని పేర్కొన్నారు.ఎస్‌జీఎఫ్ కార్యదర్శి యాకుబ్ మాట్లాడుతూ.. మందమర్రిలో జిల్లా స్థాయి నెట్‌బాల్ సెలక్షన్స్ నిర్వహించడం ఇది రెండోసారి అని తెలిపారు. గత ఏడాది మందమర్రి కృష్ణవేణి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారని, ఈ ఏడాది కూడా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం కోశాధికారి కనపర్తి రమేష్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో పాల్గొనడం ఒక అవకాశం మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని అన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభతో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆటతో పాటు మాటతీరు, ప్రవర్తన, నడవడిక, క్రమశిక్షణ విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.విజయం సాధించినప్పుడు వినయంగా, ఓటమి ఎదురైనప్పుడు నిరుత్సాహపడకుండా దానిని ఒక పాఠంగా తీసుకోవాలని రమేష్ సూచించారు. క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడు తన లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం సాధన చేస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు."మీపై నమ్మకంతో మైదానంలోకి అడుగుపెట్టండి. మీ ప్రతిభను నిర్భయంగా ప్రదర్శించండి. మీ లక్ష్యం జట్టు కోసం ఆడటం, జిల్లాకు గౌరవం తీసుకురావడం కావాలి" అని రమేష్ క్రీడాకారులకు ఉత్సాహాన్ని నింపారు.ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి యాకుబ్, కృష్ణవేణి పాఠశాల కరస్పాండెంట్ రాం వేణు, పీడీ ఆకృతి, ప్రవీణ్, పీఈటీలు అంకిల, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో క్రీడా, సాంస్కృతిక పోటీల సందడి

ఉత్సాహంగా డిపార్ట్‌మెంటల్ పోటీలు.. ప్రతిభ చాటుకున్న ఉద్యోగులు



మందమర్రి, సెప్టెంబర్ 20: సింగరేణి మందమర్రి ఏరియాలో డిపార్ట్‌మెంటల్ క్రీడా, సాంస్కృతిక పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. స్థానిక సింగరేణి యోగ హాల్‌లో డిపార్ట్‌మెంటల్ సాంస్కృతిక పోటీలు, సింగరేణి హైస్కూల్ మైదానంలోని ఇండోర్ హాల్‌లో టేబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ పోటీలు నిర్వహించారు.పోటీలను ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ, కేకే ఏజెంట్ ఖదీర్, జీఎం కార్యాలయ సీనియర్ పీఓ సందీప్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు ఉద్యోగుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉండే ఉద్యోగులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపోటముల కంటే పాల్గొనడం, క్రీడా స్ఫూర్తితో ప్రతిభను ప్రదర్శించడం ముఖ్యమని తెలిపారు.సాంస్కృతిక పోటీల ప్రాధాన్యతను వివరిస్తూ.. ఉద్యోగుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, కళాత్మక ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు మంచి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. సంగీతం, నాటకం, నృత్యం తదితర కళారూపాలు ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు మానసిక ఆనందాన్ని అందిస్తాయని అన్నారు.పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా, కళా నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎగేటి రాజేశ్వరరావు, పెద్దపల్లి బాలయ్య, ఫ్యూ/+ూ కోఆర్డినేటర్ శివ, జనరల్ కెప్టెన్ సాక శ్రీను, కల్చరల్ కెప్టెన్ సాధన వేణి ప్రభాకర్, సీనియర్ కళాకారులు హేమంత్, సుదర్శన్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, కళాకారులు పాల్గొన్నారు.

## అఖిల భారత యాదవ సంఘం
# కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం విజయవంతం..

బండి సదానందం సేవలను కొనియాడిన కార్యకర్తలు..

కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్...



మందమర్రి, సెప్టెంబర్, 20..మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని ఇందు గార్డెన్‌లో అఖిల భారత యాదవ సంఘం కార్యకర్తల ఆత్మీయ,విస్తృత స్థాయి సమావేశం అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.ఈ సమావేశానికి అఖిల భారత యాదవ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బండి సదానందం అధ్యక్షత వహించారు.ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి యాదవ సోదరులు, నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావడంతో ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది.కార్యక్రమంలో ముఖ్య అతిథులు, కార్యకర్తలు మాట్లాడుతూ.బండి సదానందం దశాబ్దాలుగా సమాజానికి,యాదవ జాతి సంక్షేమానికి అందిస్తున్న నిస్వార్థ సేవలను కొనియాడారు. కష్టకాలంలో ఎవరొచ్చినా ఆదుకోవడంలో ముందుండే నాయకుడని, రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రజా మనిషి అని గుర్తుచేశారు. సామాజిక న్యాయం, నాయకత్వ పటిమను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బండి సదానందంకు తగిన కార్పొరేషన్ పదవి కేటాయించి సముచిత గౌరవం కల్పించాలని ఏకగ్రీవంగా తీర్మానిస్తూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అనంతరం బండి సదానందం భావోద్వేగ ప్రసంగం చేస్తూ.సంఘం తనపై ఉంచిన విశ్వాసానికి చేతులెత్తి నమస్కరించారు. సంఘం కోసం, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం తన చివరి రక్తపు బొట్టు వరకు అంకితభావంతో పోరాడతానని హామీ ఇచ్చారు.ఎవరికి ఏ ఆపద వచ్చినా అర్ధరాత్రి పిలిచినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు:సంఘంలో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా అది మన కుటుంబ సమస్యగా భావించి ప్రతి ఒక్కరూ బాసటగా నిలవాలి. వ్యక్తిగత భేదాలు పక్కనబెట్టి ఐక్యతను చాటాలి.సమాజంలో పేద విద్యార్థులను ఉన్నత చదువులకు ప్రోత్సహించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సంఘం తరఫున నిరంతర తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన యాదవులకు అందేలా కార్యకర్తలు ఒక వారధిలా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ మహాసభకు మంచిర్యాల జిల్లాతో పాటు పెద్దపల్లి జిల్లా, గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం, బెల్లంపల్లి,చెన్నూర్, మందమర్రి రూరల్ తదితర చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ప్రతినిధులు తరలివచ్చారు. ఇంతటి భారీ స్పందనతో సమావేశాన్ని అపూర్వ విజయం చేసినందుకు ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకునికి సదానందం పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఆయనను కార్యకర్తలు భారీ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# బీజేపీ వార్డు సభ్యురాలు కాంగ్రెస్‌లో చేరిక



మంచిర్యాల: సెప్టెంబర్ 20 మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం పెద్దపేట్ గ్రామానికి చెందిన బీజేపీ 4వ వార్డు సభ్యురాలు బొడ్డు సత్యవతి--వెంకటేష్ దంపతులు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఆర్ జి పి ఆర్ ఎస్ గడ్డం త్రిమూర్తి, గ్రామ నాయకులు బండారి వెంకటేష్, మల్లేష్, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీల్లో దళిత ప్రజాప్రతినిధుల ఫొటోలు
# లేకపోవడంపై నిరసన



మంచిర్యాల: సెప్టెంబర్ 20 మంచిర్యాల పట్టణంలో ఎంపీ వంశీకృష్ణ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధుల ఫొటోలు లేకపోవడాన్ని నిరసిస్తూ ఆదివారం ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, కార్పొరేటర్ హరికృష్ణ మాట్లాడుతూ ఎంపీ అధికారిక పర్యటనలో స్థానిక దళిత ప్రజాప్రతినిధుల ఫొటోలు పెట్టకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో ఎంపీ విజయానికి కృషి చేశామని గుర్తుచేశారు. ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు పట్టణ సుందరీకరణలో భాగంగా తొలగించారని తెలిపారు. అధికారులు, సిబ్బంది జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

## వరద గుప్పిట్లో ఆదివాసీ పల్లెలు..
# మధ్యలోనే ఆగిన వంతెన కల!

లక్మాపూర్ వాగుపై శాపంగా మారిన పాలకుల నిర్లక్ష్యం...

ఏళ్లుగా తప్పని జలదిగ్బంధం..

చేతిలో ప్రాణాలు పెట్టుకుని అవతలి గట్టుకు ప్రయాణం...

చిన్న కల్వర్టులు వద్దు..వరద ప్రవాహాన్ని తట్టుకునేలా పెద్ద వంతెన నిర్మించాలని స్థానికుల డిమాండ్




కుమురం భీం, సెప్టెంబర్ 20. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుంటే చాలు.. ఆ ఊరి ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. వాగు ఉప్పొంగితే బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. కళ్లెదుటే ఉగ్రరూపం దాల్చే వరద ప్రవాహం.. ఏదైనా అత్యవసరమైతే ఆ వరదను దాటలేక బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేరమెరి మండలంలోని లక్మాపూర్ గ్రామ సమీప వాగుపై వంతెన లేక ఏజెన్సీ ప్రజలు అనుభవిస్తున్న నరకయాతన ఇది. పాలకులు మారుతున్నా, అధికారులు వస్తున్నా తమ బతుకుల్లో మాత్రం ఎలాంటి మార్పు రాలేదని గిరిజన పల్లెలు కన్నీరుమున్నీరవుతున్నాయి.

### ఆశలు రేపి.. మధ్యలోనే నిలిపిన వంతెన పనులు

గ్రామస్తుల దశాబ్దాల రాకపోకల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు, పాలకులు కొంతకాలం క్రితం వాగుపై వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.దీంతో తమ ఏళ్లనాటి కష్టాలు తీరబోతున్నాయని గ్రామస్తులు సంబరపడ్డారు. అయితే,ఆ సంతోషం ఎంతోకాలం నిలవలేదు.పనులు సగం వరకు మాత్రమే చేపట్టి కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు అర్ధాంతరంగా నిలిపివేశారు. ప్రస్తుతం ఆ అసంపూర్తి పిల్లర్లు అధికారుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యాలుగా మిగిలిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడమా, లేక నిధుల కొరతా అన్నది పక్కనపెడితే.. బాధితులుగా మిగిలింది మాత్రం అమాయక ప్రజలే.

### స్తంభించిపోతున్న గ్రామీణ జీవనం

లక్మాపూర్‌తో పాటు పరిసర ఆవాసాల ప్రజలు నిత్యావసర సరుకులు, వ్యవసాయ పనులు, వైద్యం, విద్య, మండల కేంద్రానికి వెళ్లడం వంటి ప్రతి పనికీ ఈ మార్గంపైనే ఆధారపడతారు. వాగు ప్రవాహం పెరిగిన ప్రతిసారీ గ్రామీణ జీవన చక్రం పూర్తిగా స్తంభించిపోతోంది.గ్రామంలో ఎవరికైనా తీవ్ర అస్వస్థత వచ్చినా, నిండు గర్భిణులకు పురిటి నొప్పులు మొదలైనా ఆసుపత్రికి చేర్చడం ప్రాణసంకటంగా మారుతోంది.108 వాహనం కూడా అవతలి గట్టునే ఆగిపోవడంతో,వాగు దాటించలేక మృత్యువుతో పోరాడాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.కేరమెరి లేదా ఇతర ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వర్షాకాలంలో బడికి వెళ్లలేకపోతున్నారు. తరగతులకు గైర్హాజరవుతూ చదువుల్లో వెనుకబడిపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలంలో పండే పత్తి, సోయా, ఇతర పంట ఉత్పత్తులను మండల కేంద్ర మార్కెట్‌కు తరలించలేక అన్నదాతలు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నారు. మరోవైపు రోజూ కూలీ పనులకు వెళ్లే కూలీల బతుకులు ఆగిపోతున్నాయి.

### చిన్న కల్వర్టులు కాదు.. పెద్ద వంతెనే పరిష్కారం.

వర్షాకాలంలో ఎగువ అటవీ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటి ఉధృతి సాధారణంగా ఉండదు. గతంలో ప్రతిపాదించినట్లు చిన్నపాటి కల్వర్టులతో సమస్య తీరదని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. భవిష్యత్తులో వరద ఉధృతిని తట్టుకునే విధంగా పూర్తిస్థాయి ఎత్తుతో కూడిన పెద్ద వంతెన (హై లెవల్ బ్రిడ్జి) నిర్మిస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కుతుందని పేర్కొంటున్నారు.

### ప్రాణనష్టం జరగకముందే స్పందించండి!

తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న మట్టి దారులు వాగు ఉధృతికి కొట్టుకుపోతుండటంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి నిండు ప్రాణం బలైపోతే తప్ప అధికారులు మేల్కోరా అని స్థానికులు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, పెండింగ్‌లో ఉన్న వంతెన పనులకు అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని లక్మాపూర్ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా 6వ రాష్ట్ర స్థాయి
# కరాటే చాంపియన్‌షిప్ పోటీలు

ఆత్మరక్షణకు, మానసిక ఉల్లాసానికి కరాటే ఎంతో అవసరం:

ముఖ్య అతిథులు .600 మందికి పైగా విద్యార్థులు,

తల్లిదండ్రుల భాగస్వామ్యం..




బెల్లంపల్లి, సెప్టెంబర్ 20. బెల్లంపల్లి మండలంలోని సోమగూడెం త్రినేత్రి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం (20-09-2026) 6వ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. కుందేళ్ళ రవి మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు, మాస్టర్లు తరలివచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందమర్రి సింగరేణి జీఎం రాధాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, కమిటీ అధ్యక్షులు మల్లేష్ హాజరయ్యారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ--- నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా చిన్నారులు, విద్యార్థులకు ఆత్మరక్షణ కోసం కరాటే వంటి విద్యల శిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి శారీరక శిక్షణల వల్ల పిల్లలు దురలవాట్లకు దూరంగా ఉంటూ, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పొందుతారని తెలిపారు. క్రీడల్లో రాణిస్తూనే చదువుకు కూడా మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని వారు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో సాధన చేసి తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన మాస్టర్లకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల నుంచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. మన ప్రాంతంలో ఇంత ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులు మాస్టర్ కుందేళ్ళ రవిని వారు ప్రత్యేకంగా అభినందించారు.ఈ పోటీలలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, కరాటే మాస్టర్లు, తల్లిదండ్రులు కలిపి 600 మందికి పైగా పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన విన్యాసాలు, కరాటే మెళకువలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



## బిగ్ బాస్ కే కండీషన్లు పెట్టిన నయా స్టార్!

బాలీవుడ్ డ్యాన్సింగ్ సెన్సేషన్ నోరా ఫతేహి కెరీర్ ప్రారంభంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరు చుకు న్నారు. అయితే ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నోరా కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులు .. బిగ్ బాస్ 9 రియాలిటీ షోలోకి అడుగుపెట్టడానికి దారితీసిన పరిస్థితుల గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. 2015 డిసెంబర్‌లో వైల్డ్‌కార్డ్ కంటెస్టెంట్‌గా బిగ్ బాస్ హౌస్‌లోకి వెళ్లడానికి నోరా విధించిన షరతు నెట్టింట చర్చనీయాంశంగా మారింది. దానికి సంబంధించిన పారితోషికం తనకు సకాలంలో అందలేదని నోరా తెలిపారు. ప్రొడ్యూసర్లు ఏజెన్సీలకు డబ్బులు చెల్లించినా? తన వద్దకు ఆ సొమ్ము చేరక పోవడంతో డబ్బుల కోసం ఏజెన్సీలతో పోరాడాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అలా సంపాదించిన సొమ్ము రాక, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలోనే తనకు బిగ్ బాస్ షో నుంచి పిలుపు వచ్చిందని వెల్లడించారు. మొదట్లో రియాలిటీ షోల పట్ల తనకు మంచి అభిప్రాయం లేదని.. అందుకే బిగ్ బాస్ ప్రతిపాదనను తిర స్కరించాలని భావించినట్లు నోరా తెలిపారు. అయితే మంచి రెమ్యునరేషన్ ఆఫర్ చేయడంతో పాటు.. ఆ ఛానెల్‌తో ఓ ఒప్పందానికి వచ్చానన్నారు. డ్యాన్స్ రియాలిటీ షో -జలక్ దిఖ్లా జా- లో పాల్గొనాలనేది తన అసలు కోరిక అని.. ఆ షోలో అవకాశం ఇస్తేనే బిగ్ బాస్‌కు వస్తానని షరతు విధించానని.. దానికి నిర్వాహకులు అంగీకరించడంతోనే బిగ్ బాస్ హౌస్‌లోకి అడుగుపెట్టానని వెల్లడించారు. బిగ్ బాస్ 9లో మూడు వారాల పాటు మాత్రమే ఉన్నా? ఆ షో ద్వారా నోరా ఫతేహి ప్రతి ఇంట్లోనూ సుపరిచితమైన ముఖంగా మారారు. ఈ షో సమయంలోనే తోటి కంటెస్టెంట్, ఆ సీజన్ విజేత అయిన ప్రిన్స్ నరులాతో ఆమె ఏర్పరచుకున్న అనుబంధం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆ తర్వాత తాను అనుకున్నట్లే -జలక్ దిఖ్లా జా- షోలో కూడా పాల్గొని అద్భుతమైన డ్యాన్స్ ప్రతిభతో అందరినీ మైమరిపించారు. బిగ్ బాస్ నుంచి ప్రారంభమైన నోరా పటేహీ ప్రయాణం ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయికి చేరింది. ఇటీవల జరిగిన ఫీఫా వరల్డ్ కప్ ప్రారంభోత్సవ వేడుకలో తన ప్రదర్శనతో గ్లోబల్ వేదికపై మెరిశారు. అలాగే సంజోయ్ - వెజెడ్రీ మ్‌లతో కలిసి ఫీఫా 2026 అధికారిక పాట -సీర్ సీర్- లో కూడా భాగమయ్యారు. ప్రస్తుతం వరుస అంతర్జాతీయ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నోరా ఫతేహి నూతన ఈపీ -ప్లే- నుంచి -ప్లే టు ది రిథమ్- పాటను విడుదల చేశారు. అంతకుముందు బాద్‌షాతో కలిసి చేసిన -సాజన్ రే- పాటకు కూడా మంచి ఆదరణ లభించింది. త్వరలోనే సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తోన్న -జైలర్ 2- చిత్రంలో అనిరుధ్ రవిచందర్ సంగీత సారథ్యంలో ప్రత్యేక డ్యాన్స్ నంబర్‌లో హాట్ బ్యూటీ అలరించనున్నారు.

# బాలయ్య సినిమాకు మారుతున్న ఓటీటీ లెక్కలు




నందమూరి బాలకృష్ణ సినిమాలంటే ఒకప్పుడు ప్రధానంగా థియేట్రికల్ మార్కెట్ గురించే డిస్కషన్ జరిగేది. ముఖ్యంగా మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేసే సినిమాలకు బాక్సాఫీస్ కలెక్షన్లే కీలకంగా కనిపించేవి. అయితే ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతున్నట్టుగా కనిపిస్తోంది. థియేటర్లలో బాలయ్యకు ఉన్న మార్కెట్‌తో పాటు, సినిమా రిలీజ్ కు ముందే నాన్-థియేట్రికల్ రైట్స్ ద్వారా వచ్చే ఆదాయం కూడా నిర్మాతల లెక్కల్లో కీలకంగా మారుతోంది. ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న దాదా విషయంలో కనిపిస్తున్న బిజినెస్ ఇంట్రెస్ట్ ఇదే మారుతున్న ట్రెండ్‌కు ఎగ్జాంపుల్ గా నిలుస్తోంది. దాదా డిజిటల్, శాటిలైట్, ఆడియో రైట్స్ కలిపి భారీ మొత్తానికి క్లోజ్ అయినట్లు వస్తున్న వార్తలు కేవలం ఒక సినిమా బిజినెస్ నంబర్‌గా చూడాల్సిన విషయం కాదనే అభిప్రాయం ఇండస్ట్రీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. స్టార్ హీరోల సినిమాలకు ఓటీటీ, శాటిలైట్, మ్యూజిక్ రైట్స్ ముందుగానే మంచి మొత్తాన్ని తీసుకురావడంతో థియేట్రికల్ మార్కెట్‌పై ఉండే మొత్తం రికవరీ ప్రెజర్ కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ఒక సినిమా లాభాల్లోకి వెళ్లిందని చెప్పాలంటే బడ్జెట్, థియేట్రికల్ రైట్స్ వాల్యూ, ఇతర ఖర్చులు వంటి పూర్తి లెక్కలు కూడా లెక్కలోకి తీసుకోవాల్సిందే. ఇక్కడ మరో ఇంట్రెస్టింగ్ విషయం మాస్ సినిమాలకు నాన్ థియేట్రికల్ మార్కెట్‌లో ఏర్పడుతున్న డిమాండ్. స్టార్ హీరోల సినిమాలకు థియేటర్లలో మాత్రమే కాకుండా టెలివిజన్, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలోనూ స్పెషల్ ఆడియన్స్ ఉండటంతో ఈ రైట్స్ కు స్పెషల్ వాల్యూ ఏర్పడుతోంది. ముఖ్యంగా యాక్షన్, మాస్ ఎంటర్‌టైనర్‌లకు రిపీట్ వ్యూయింగ్, ఫ్యామిలీ ఆడియన్స్ రీచ్ వంటి అంశాలు శాటిలైట్, డిజిటల్ బిజినెస్‌లో కీలకంగా మారుతున్నాయి. దీంతో నిర్మాతలు ఇప్పుడు సినిమా బడ్జెట్‌ను మాత్రమే కాకుండా థియేట్రికల్, నాన్-థియేట్రికల్ ఆదాయాలను కలిపి ప్రాజెక్ట్ రికవరీని లెక్కించే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో దాదా మరో ప్రశ్నను కూడా ముందుకు తీసుకొస్తోంది. బాలయ్య సినిమాల ఓటీటీ లెక్కలు మారుతున్నాయా? గతంలో బాలయ్య సినిమాల మార్కెట్‌ను ప్రధానంగా థియేట్రికల్ కలెక్షన్లతో అంచనా వేసే పరిస్థితి ఉంటే, ఇప్పుడు నాన్-థియేట్రికల్ రైట్స్ కూడా ఆ మార్కెట్‌లో ఒక ముఖ్యమైన కొలమానంగా మారుతున్నాయి. దాదాకు సంబంధించిన తాజా బిజినెస్ ఇంట్రెస్ట్ ను కలిగించగా, ఫ్యూచర్ లో బాలయ్య సినిమాల బిజినెస్ ప్లానింగ్‌లో ఓటీటీ, శాటిలైట్, ఆడియో రైట్స్ కు మరింత ప్రాధాన్యం దక్కే అవకాశముంది. అంటే బాలయ్య సినిమా బిజినెస్ ఇక థియేటర్ల దగ్గర మొదలై అక్కడే ముగిసే లెక్క కాకుండా.. రిలీజ్‌కు ముందే పలు దశల్లో రికవరీని నిర్మించుకునే మోడల్‌గా మారుతున్నట్టుగా కనిపిస్తోంది.



# 13 ఏళ్ల వయసులోనే ఒంటరిగా ముంబై ప్రయాణం



భారతీయ సినీ యవనికపై తనదైన ముద్రతో దశాబ్దాల పాటు కోట్లాది మంది అభిమానులను అలరించిన దిగ్గజ నటి రేఖ. అయితే వెండితెరపై ఎంతోమందికి కలల రాణిగా వెలిగిన రేఖ చిన్నతనంలో నటి కావాలనే ఆశ అసలు లేదనే విషయం ఎంతమందికి తెలుసు? 1986లో ఓ పాత ఇంటర్వ్యూలో రేఖ సినీ ప్రయాణ ప్రారంభం గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తానెప్పుడూ హీరోయిన్ అవ్వాలని అనుకోలేదని, పరిస్థితుల ప్రభావంతో బలవంతంగానే పరిశ్రమలోకి అడుగుపెట్టాల్సి వచ్చిందని తెలిపారు. రేఖ తండ్రి జెమిని గణేషన్ దక్షిణ భారత దేశంలో ప్రముఖ నటుడు కాగా, ఆమె తల్లి కూడా నటియే. చాలామంది నటీనటులు చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తితో ఇండస్ట్రీలోకి వచ్చామని చెబుతుంటారు. కానీ రేఖ విషయంలో అది పూర్తిగా భిన్నంగా జరిగింది. మూడేళ్ల ఏళ్ల వయసులోనే రేఖ బాలనటిగా పరిచయం అయ్యారు. తన తల్లి కోరిక మేరకే తాను సినిమాల్లోకి రావాల్సి వచ్చిందని.. బలవంతంగా కొట్టి మరీ నటిని చేశారని రేఖ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇక హిందీ చిత్రసీమలో అడుగుపెట్టే నాటికి రేఖకు 13 ఏళ్ల వయసు మాత్రమే ఉంది. చెన్నై నుంచి ఇద్దరు వ్యక్తులు కొత్త హీరోయిన్ కోసం వెతుకుతున్నారు. హిందీ అస్సలు రాని రేఖను చూసి కాంట్రాక్ట్ కుదుర్చుకున్నారు. తల్లి ఆరోగ్యం బాగోకపోవడంతో ఏమాత్రం పరిచయం లేని ముంబై నగారానికి 13 ఏళ్ల పిన్న వయసులోనే ఒంటరిగా రేఖ ప్రయాణమయ్యారు. హిందీ భాష తెలియకపోయినా? నటనపై ఆసక్తి లేకపోయినా? విధి తరిమిన దారిలోనే హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టానని తెలిపారు. సినిమాల్లోకి వచ్చిన ప్రారంభంలో డబుల్ షిఫ్టుల్లో పనిచేస్తూ రేఖ తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. రేఖ నటించిన తొలి హిందీ చిత్రం -సావన్ భాదో- ఘనవిజయం సాధించడంతో రాత్రికి రాత్రే స్టార్‌ను చేసింది. రేఖ స్కూల్ సహచరులు సినిమా చూసి మెచ్చుకుంటుంటే? ఎంతో గర్వంగా ఉందనిపించినా? ఆ సమయంలో తాను ఏం చేస్తున్నానో కూడా తనకే సరిగ్గా అర్థమయ్యేది కాదని రేఖ పేర్కొన్నారు. మొదటి 6-7 సంవత్సరాల పాటు నటన ఎంతమాత్రం నచ్చలేదని స్పష్టం చేశారు. రేఖ జీవితంలో, ఆలోచనా విధానంలో అసలైన మార్పు 1975 నాటి -ఘర్- చిత్రంతోనే వచ్చింది. ఆ చిత్రంలో తన పాత్రలోని సహజత్వాన్ని గ్రహించిన రేఖ తొలిసారి నటనపై నిజమైన ఆసక్తిని పెంపొం దించుకున్నారు. అప్పటివరకు ఒక ఉద్యోగంలా మాత్రమే చూసిన నటన ఆ సినిమా తర్వాత కళగా గౌరవించడం, ఆస్వాదించడం ప్రారంభించారు. ప్రారంభంలో విధిలేక చిత్ర పరిశ్రమలోకి వచ్చి నటనను అసహ్యించుకున్న రేఖ అటుపై దానినే జీవిత పరమావధిగా మార్చుకున్నారు. -హీరోయిన్ అవ్వడం ఇష్టం లేదన్న నా జీవితంలో, ఇప్పుడు నటన మాత్రమే ఏకైక నిజమైన అంశంగా మారింది.. దీనిని నేను ఎంతగానో ఆస్వాదిస్తున్నాను- అని రేఖ చెప్పిన మాటలు, ఆమె సాధించిన పరిణతికి నిదర్శనంగా చెప్పొచ్చు.

## బ్లాక్ డ్రెస్‌లో హీట్ పెంచేసిన మృణాల్ ఠాకూర్.. కిల్లర్ లుక్స్‌తో రచ్చ!



తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సీతా రామం'తో చెరగని ముద్ర వేసుకున్న అందాల భామ మృణాల్ ఠాకూర్, తాజాగా పోస్ట్ చేసిన హాట్ పిక్స్‌తో సోషల్ మీడియాలో సెగలు రేపుతోంది. క్లాసీ బ్లాక్ డ్రెస్‌లో తనదైన స్టైల్ మార్క్ చూపిస్తూ ఈ ముద్దుగుమ్మ ఇచ్చిన పోజులు నెటిజన్లను అవాక్కయ్యేలా చేస్తున్నాయి. సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్‌లో దేవకన్యలా మెరిసిపోతున్న మృణాల్ పిక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతూ ఫ్యాన్స్‌ను తీవ్రంగా ఆకట్టుకుంటున్నాయి. షాహిన్ మన్నన్ డిజైనర్ డ్రెస్‌లో మృణాల్ : ఈ ప్రత్యేక ఫోటోషూట్ కోసం మృణాల్ ఠాకూర్ 'షాహిన్ మన్నన్' బ్రాండ్‌కు చెందిన ప్యాపీ ఫ్లవర్ బ్లౌజ్ అండ్ స్టేట్‌మెంట్ స్కర్ట్ అవుట్‌ఫిట్‌ను ఎంచుకుంది. ఇక ఫుల్ స్లీవ్స్ క్రాప్డ్ బ్లౌజ్, దానికి తగ్గట్టుగా ఉన్న హై-వేస్ట్ ఫుల్లీ ఫ్లేర్డ్ స్కర్ట్‌పై కింద భాగంలో ఎరుపు రంగు పూల ఎంబ్రాయిడరీ వర్క్ ఆమె లుక్‌కు గ్రాండ్ అప్పీల్‌ను తెచ్చిపెట్టింది. నడుము వద్ద సన్నని బెల్ట్, డోప్ కట్స్‌తో మృణాల్ ఎంతో రాయల్‌గా మెరిసిపోయింది. ఫ్యాన్స్ ఫిదా.. నెట్టింట లైకుల వర్షం: ఈ అద్భుతమైన పిక్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయగానే ఫ్యాన్స్ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. "బ్రీత్‌టేకింగ్ ప్రిన్సెస్", "అబ్సల్యూట్లీ స్టన్నింగ్ అండ్ గార్జియస్", "బ్లాక్ కలర్‌లో నీ అందం వేరే లెవెల్" అంటూ నెటిజన్లు పొగడ్తలతో నింపేస్తున్నారు. వెలుతురులో చిరునవ్వుతో ఉన్న మృణాల్ పిక్స్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచాయి. బుల్లితెర నుంచి స్టార్ హీరోయిన్ వరకు : మహారాష్ట్రకు చెందిన మృణాల్ ఠాకూర్, 'కుంకుమ భాగ్య' సీరియల్‌తో మంచి పాపులారిటీ సాధించి, 'లవ్ సోనియా' చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. 'సూపర్ 30', 'బాట్లా హౌస్' చిత్రాల్లో నటిగా మెప్పించిన ఈ భామ, 'సీతారామం'తో పాన్ ఇండియా లెవెల్లో భారీ క్రేజ్ సంపాదించుకుంది. ఇక ఆ తర్వాత 'హాయ్ నాన్న', 'జెర్సీ', 'ది ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాలతో వరుస విజయాలు అందుకుంది. చేతిలో వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులు: ఇక రీసెంట్ గా సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి 'దో దివానే షెహర్ మే', అడివి శేష్ సరసన బైలింగువల్ డ్రామా 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ', వరుణ్ ధావన్‌తో కలిసి 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రాల్లో నటించి మంచి సక్సెస్ అందుకుంది..ఇక తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో పాటు విభిన్నమైన పాత్రలతో ఆకట్టుకుంటున్న మృణాల్ ఠాకూర్, రాబోయే రోజుల్లో అన్ని భాషల్లోనూ మరిన్ని భారీ విజయాలు సాధించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# మళ్లీ ఏడాదికి రెండు.. నాని స్పీడ్ పెంచితే..




ఒకప్పుడు ఏడాదికి రెండు, మూడు సినిమాలు.. వరుసగా రిలీజ్ లు.. బ్యాక్ టు బ్యాక్ హిట్లు.. ఇదే నేచురల్ స్టార్ నాని స్పీడ్. కానీ ఇప్పుడు సినిమా రేంజ్ పెరిగింది. స్టోరీ, స్కేల్, బడ్జెట్ అన్నీ మారడంతో ఒక్కో సినిమాకు ఎక్కువ టైమ్ తీసుకుంటున్నారు. దీంతో ఏడాదికి ఒక సినిమాతోనే నాని సరిపెట్టుకోవాల్సి వస్తోంది. మరి మళ్లీ అదే పాత స్పీడ్ లో నాని ఏడాదికి రెండు సినిమాలతో వస్తే ఎలా ఉంటుంది? ప్రస్తుతం ఆయన లైనప్ చూస్తుంటే ఆ ఛాన్స్ కనిపిస్తోంది. 2008లో అష్టా చమ్మాతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన నాని.. ఇప్పటివరకు 30కి పైగా సినిమాల్లో నటించారు. కెరీర్ లో ఒకే ఏడాదిలో హైయెస్ట్ గా మూడు సినిమాలతో వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. 2016లో కృష్ణగాడి వీరప్రేమగాథ, జెంటిల్ మన్, మజ్ను సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఆ తర్వాత 2017లో నేను లోకల్, నిన్ను కోరి, ఎంసీఏ సినిమాలతో వరుసగా సందడి చేశారు. అంటే అప్పట్లో నాని సినిమా స్పీడ్ ఎలా ఉండేదో చెప్పాల్సిన అవసరం లేదు. కానీ కొంతకాలంగా ఆయన సినిమాల విషయంలో లెక్క మారింది. స్టోరీలో సెలక్షన్ తోపాటు సినిమా రేంజ్ కూడా పెరిగింది. దసరాతో పాన్ ఇండియా రేంజ్ లోకి వెళ్లిన నాని.. ఆ తర్వాత కూడా తన సినిమాలపై ఎక్కువ టైమ్ కేటాయిస్తున్నారు. దీంతో ఏడాదికి ఒక మూవీ రావడం కామన్ అయిపోయింది. 2023లో దసరా, హాయ్ నాన్న సినిమాలతో రెండు సార్లు ప్రేక్షకుల ముందుకు వచ్చిన నాని.. 2024లో సరిపోదా శనివారంతో వచ్చారు. 2025లో హిట్: ది థర్డ్ కేస్, ఇప్పుడు 2026లో ది ప్యారడైజ్ తో ప్రేక్షకులను పలకరించనున్నారు. అంటే ఏడాదికి ఒక్క సినిమా అయినా.. నాని మాత్రం వరుసగా ప్రతి ఏడాది ప్రేక్షకులకు కనిపిస్తూనే ఉన్నారు. ఇప్పుడు అసలు విషయం ప్యారడైజ్ తర్వాతే మొదలవుతోంది. ఆ సినిమా తర్వాత నాని చేతిలో ఎక్కువ ప్రాజెక్టులే ఉన్నాయి. ముందుగా సుజీత్ దర్శకత్వంలో బ్లడీ రోమియో త్వరలో ప్రారంభం కానుంది. ఆ తర్వాత కోలీవుడ్ డైరెక్టర్ సిబి చక్రవర్తితో ఓ మూవీ చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది. దర్శకుడు వెంకీ అట్లూరితో నాని వర్క్ చేయనున్నట్లు సమాచారం. మరికొన్ని చర్చల్లో ఉన్నట్లు వినికిడి. ఇలా వరుసగా మూడు సినిమాలు లైనప్ లో ఉండటంతో నాని నెక్స్ట్ రెండు మూడేళ్లు బిజీగా ఉండనున్నారు. అయితే షూటింగ్స్ వేగంగా పూర్తి చేసి రిలీజ్ లను ప్లాన్ చేస్తే 2027,2028లో నాని నుంచి ఒకటి కంటే ఎక్కువ సినిమాలు వచ్చే అవకాశం కూడా ఉంది. ఇదే జరిగితే నాని ఫ్యాన్స్ కు పాత రోజులు గుర్తుకు రావడం ఖాయం. ఒకప్పుడు ఏడాదికి రెండు, మూడు సినిమాలతో థియేటర్లలో సందడి చేసిన నాని.. ఇప్పుడు భారీ కథలు, బిగ్ స్కేల్ తో సినిమాలు చేస్తూనే మళ్లీ అదే స్పీడ్ అందుకుంటే మాత్రం ఫ్యాన్స్ కు పండగే. మరి ప్యారడైజ్ తర్వాత నాని స్పీడ్ ఎలా ఉండబోతుందో వేచి చూడాలి.

# గ్లామర్ వెనుక అసలైన కష్టం.. తెర వెనుక ఫ్యాక్ట్ బయటపెట్టిన రాశి సింగ్ !



చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తిని పెంచుకున్న ప్రముఖ బ్యూటీ రాశి సింగ్ కి.. 14 ఏళ్ల వయసులోనే ఒక కమర్షియల్ యాడ్ లో అవకాశం వచ్చినా. వ్యక్తిగత కారణాల వల్ల వదులుకుంది. చదువు పూర్తి చేసుకున్న ఈమె తొలిసారి ఇండిగో ఎయిర్ లైన్స్ లో ఎయిర్ హోస్టేస్ గా కెరియర్ ప్రారంభించింది. ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉన్న సమయంలోనే 2019లో జెమ్ అనే తెలుగు చిత్రంతో నటిగా అరంగేట్రం చేసింది. ఆ తర్వాత పోస్టర్, ప్రసన్న వదనం, బ్లైండ్ స్పాట్ , సంతాన ప్రాప్తిరస్తు, ట్రాన్సుర్ త్రిమూర్తులు ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ ఏవి కూడా ఈమెకు అనుకునేంత స్థాయిలో గుర్తింపును అందివ్వలేదు. రంభాషీగా రాశి సింగ్.. కానీ రీసెంట్గా అల్లరి నరేష్ హీరోగా వచ్చిన రంభ ఊర్వశి మేనక చిత్రంలో రంభ పాత్రతో అందరి దృష్టిని తన వైపు తిప్పుకుంది రాశి సింగ్. ఈ సినిమా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోకపోయినా.. ఇందులో ఆమె నటన అందరి దృష్టిని ఆకట్టుకుంది. ముఖ్యంగా ఆమె గ్లామర్ కుర్రకారుకు మంచి ట్రీట్ ఇచ్చింది. అంతేకాదు రంభ పాత్రకు సంబంధించిన గ్లామర్ లుక్ ను ఎప్పటికప్పుడు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా షేర్ చేస్తూ.. సినిమాపై అంచనాలు పెంచేసింది. సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోకపోయినా రంభ పాత్రలో రాశి సింగ్ మాత్రం మంచి పేరు దక్కించుకుంది.

గ్లామర్ వెనుక అసలైన కష్టం.. ముఖ్యంగా ఈ సినిమాలో రంభ పాత్రతో గ్లామర్ హంగులతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె ఇంత అందంగా కనిపించడం వెనుక తాను పడ్డ కష్టాన్ని అభిమానులతో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. గ్లామర్ వెనుక తాను పడ్డ కష్టం ఇదే అంటూ ఆ ఫోటోలను క్యాప్షన్ కూడా జోడించింది. రాశి సింగ్ ఈ ఫోటోలను షేర్ చేస్తూ.." మీరు తెరపై చూసేది అందం, ఆకర్షణ మాత్రమే. కానీ దానిని నిలబెట్టుకోవడానికి పడే కష్టం మీకు కనిపించదు. సరైన ఆహారం తీసుకోవడం, నా శరీరాన్ని, చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం.. ఫిట్గా ఉండడం, చల్లని రాత్రులలో, అర్ధరాత్రి వేళల్లో షూటింగ్ చేయడం, ఒళ్ళు నొప్పులు భరించడం.. అయినా కూడా ప్రదర్శన ఇవ్వడానికి తగినంత శక్తిని కలిగి ఉండడం.. అలాగే నన్ను రంబాషి అని పిలిచిన వాళ్లందరూ గెలిచారు. నేను ఆ పేరు నే ఉంచుకుంటాను. ఈ లుక్కును, నన్ను హ్యాండిల్ చేసిన నా టీం కి ప్రత్యేక ధన్యవాదాలు" అంటూ తెర వెనుక ఆ పాత్ర కోసం ఆమె పడ్డ కష్టాన్ని అభిమానులతో పంచుకుంది. తెర వెనుక కష్టాలను పంచుకున్న రాశి సింగ్.. ముఖ్యంగా రంభ పాత్ర కోసం ఆమె రెడీ అవుతున్న ఫోటోలను అలాగే నిప్పులతో చేతులను కాచుకుంటున్నట్టు ఇలా కొన్ని ఫోటోలను ఆమె షేర్ చేశారు . ఏదేమైనా సెలబ్రిటీలు మనకు వినోదాన్ని పంచుతున్నారు అంటే.. తెర వెనుక వారు పడే కష్టం ఎలా ఉంటుందో చెప్పడం వర్ణనాతీతం. ప్రస్తుతం రాశి సింగ్ షేర్ చేసిన ఫోటోలు, పంచుకున్న క్యాప్షన్ అభిమానులలో, నెటిజన్స్ లో సెలబ్రిటీస్ పై మరింత గౌరవాన్ని పెంచుతున్నాయి.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815